

# మార్జాల మృదంగం

మంచం మీదనుంచి మెల్లిగా దిగి, వంగి మంచం కిందకు తొంగి చూశాను, అంత చీకట్లోనూ తళతళా మెరుస్తూ కనిపించాయి రెండు కళ్ళు! దయ్యాల కథలు వందల కొద్దీ చదివే నేను నిజానికి ఆ క్షణంలో భయపడాల్సిన అవసరం లేదు. కానీ పగటిపూట చదివిన ఆ కథలేవీ నాకు ఆ రాత్రివేళ సాయం రాలేదు, నా వెన్ను తట్టి ధైర్యమూ చెప్పలేదు. అందుకే ఉలికి పడ్డానొకసారి!

మీదకు దూకి ఒక్కసారిగా నా కళ్ళు పీకేస్తుందేమోననీ భయపడ్డాను.

అలాటిదేమీ జరగలేదు.

'మ్యావ్' అంటూ ఆ పిల్లి నా పక్కనుంచే వెళ్ళిపోయింది.

'అమ్మయ్య అంటూ నిట్టూర్చుకొని, మళ్ళీ మంచం ఎక్కేసాను. ఆ కుదుపుకు శ్రీమతిగారి నిద్రాభంగం అయినట్లుంది. ఒత్తిగిల్లి పక్కకు ఒదిగి, నిద్రలోనే అంటున్నట్లుగా అంది 'ఏమిటండి, అర్ధరాత్రిపూట ఈ గొడవ!'

అర్ధరాత్రిట! గోడమీది రేడియమ్ గడియారం 'తలుపు తెరిచి చూస్తే తెల్లగా తెల్లారి ఉంటుంది. చూసుకోండి' అన్నట్లుగా అయిదు నిమిషాలు తక్కువ ఏడయినట్లు చెప్తోంది.

ఇంకా ఆవిడగారు అర్ధరాత్రి అంటూ గారం చేస్తోంది.

"టైం ఏడయింది. నిద్ర చాలు, ఇంకలే! అన్నాను శ్రీమతిని నిద్రలేపుతూ.

బద్ధకంతో మూలిగింది భార్యామణి.

"ఆదివారమేగదా, లేస్తాలెండి!" కాబోయే మంత్రిణిలా ఓ వాగ్దానాన్ని నా మీద విసిరేసి, అటు తిరిగింది.

నాకు ఒళ్ళు మండిపోయింది. గట్టిగా పట్టుకొని ఇటువైపు తిప్పుకొంటూ అన్నాను. "ఏం చేద్దామనుకొంటున్నాం మనం ఈ రోజు? మంచం కిందినుంచి ఈ పనికి మాలిన సామాన్లన్నీ తీసి అటకెక్కిద్దామనుకొన్నామా లేదా?

"చేద్దాంలెండి, సెలవు రోజేగదా, ఎన్ని పనులైనా చెయ్యచ్చు. ఓ అయిదు నిమిషాలు రిలాక్స్ అయి లేవనీయండి" అంటూ దుప్పటి ముసుగేసింది.

దుప్పటిని లాగి పారెయ్యచ్చుకానీ ఆ దుప్పట్లోకీ నన్ను లాక్కొందంటే సెలవురోజు కాస్తా ఏ పనీ లేకుండా ఆ పనితోనే గడిచిపోతుంది. అందుకే మనసులో చెలరేగిన ఆ చిలిపి ఊహకు చిగురు వెయ్యనీయలేదు.

అయిదు నిమిషాలందేకానీ సరిగ్గా అరగంటకు లేచింది అరుణ. లేవటంవరకే ఆలస్యం కానీ లేచాక మాత్రం క్షణం బద్ధకించదు. అన్నీ తుఫాన్‌మెయిల్ స్పీడ్‌లో చేస్తుంది. అందుకే అరుణంటే నాకంత ఇష్టంమరి.

కాఫీ తాగుతూ, పేపరు చూస్తున్న అరుణతో అన్నాను "తొందరగా కాఫీ కానీయ్ మంచం కిందనుంచి..."

పేపరును కిందపెట్టి ముఖంలోని అసంతృప్తి స్పష్టంగా నాకు తెలియజేస్తూ అంది అరుణ "మొదలు పెట్టారూ మీ మార్జాల పురాణం? మంచం కింది సామాన్లను తీసి అటక మీద పెట్టినా, పిల్లి మనిల్లు వదలదు. పులి చెట్టెక్కలేదేమోగానీ, పిల్లి చెట్టూ ఎక్కుతుంది, అటకా ఎక్కుతుంది..."

నిజమే. నాకాసంగతి నిజంగానే తట్టలేదు.

మంచంకిందివి తీసి అటకమీద పెట్టినా, పిల్లి అటక ఎక్కి కూర్చునేట్లయితే ఇంకేం లాభం? రూఫ్ గార్డన్‌లో కూర్చొని మ్యావ్, మ్యావ్ అనటంకన్నా, అండర్ గ్రౌండ్‌నుంచే ఆ సంగీతం అందించటం బాగుంటుందేమో!

నేను ఆలోచనలో పడ్డాను 'ఏం చెయ్యాలా' అని! "ఏమీ ఆలోచించకండి, నాలుగు రోజులుండి అదే పోతుంది! మనం రమ్మంటే వచ్చిందా, పొమ్మంటే పోతుందా? 'మ్యావ్, మ్యావ్' అంటూ నాలుగురోజులు అరుస్తుంది, ఆ తర్వాత అదే పోతుంది" అరుణ నెమ్మదిగా అంది. అలా అనటంతోనే అర్థమయింది నాకు ఈ రోజు ముందనుకొన్నట్లు ఆ సామాను తీసి పెట్టే పని కాస్తా జరిగే అవకాశమే లేదని!

చిన్న పిల్లి, అది చూస్తోంటే ముద్దొస్తూనే ఉన్న మాట నిజమే, తెల్లగా బుజ్జిముండ ఇంట్లో, మా ఇంట్లోనే... ఒక్కోసారి నాకన్నా హుందాగా నడుస్తుంటుంది. ఏ పనిమీదైనా బయలుదేరుతున్నప్పుడు 'హలో' అని పలకరించ వచ్చినట్లు వచ్చి ముందు నిలబడుతుంది. పని జరుగుతుందో జరగదోనన్న బెంగ అప్పటితో ఆరంభమవుతుంది. పనిమీద బయలుదేరిన నేను, ఆ పని సంగతి పక్కనబెట్టి పిల్లి ఎదురొచ్చిన విషయమై పెళ్ళాంతో ఘర్షణపడతాను. ఆ గొడవతో, ఇల్లు కదలకుండానే పని చెడితీరుతుంది.

నాకు తెలిసిన వాళ్ళు ఒకరుండేవారు. వాళ్ళకీ ఇలాంటి బెడదే వచ్చిపడింది. ఎవరిదో తెలీదు. ఓ పిల్లి వచ్చి వాళ్ళింటో మకాం పెట్టింది. పెంపుడు పిల్లి కావటంతో ఏం చేసినా కదిలేది గాదు. చివరకు ఓ గోనెబస్తాలో దాన్ని పడేసి తీసుకెళ్ళి పవర్‌పేట స్టేషన్‌లో రైల్లో పడేసి వచ్చారు. ఇంటికి తిరిగొచ్చిన అరగంటకే ఆ పిల్లి మ్యావ్ మంటూ ఇంటిముందు ప్రత్యక్షం అయింది. మూటలో ఏముందోనని ఎవరో విప్పి ఉంటారు. పిల్లి బయటపడి ఇల్లుచేరి ఉంటుందనుకొన్నారు వాళ్లు.

ఆ సంగతి నాకు తెలుసు కాబట్టి, అలాంటి ప్రయత్నాలు చేపట్టడం వృథా అని నిర్ణయించుకొన్నాను.

కానీ... దీన్ని వదిలించుకోవటం ఎలాగో అర్థమయేదికాదు, రోజూ రాత్రీ పగలు తేడాలేదు. అర్ధరాత్రి అపరాత్రీ తేడాలేదు ఎప్పుడూ పక్కవాద్యంలాగ మ్యావ్ మని పిల్లి అరుస్తోంటే చికాగ్గా ఉండదా చెప్పండి!!

అరుణకు చెప్తే అర్థమయేదికాదు. "అది ఉంటే మీకేమిటీ అడ్డు?" అనేది. "పిల్లి ఎదురురావటం దుశ్శకునమే! అంటే నవ్వేసేది. 'శకునాలూ వగైరా మూఢనమ్మకాల్లోంచి ఈ దేశం ఎప్పుడు బయట పడుతుందో'నని నిట్టూర్చేది! మొగుడ్ని డైరెక్టుగా తిడితే కళ్లు పోతాయనే మూఢనమ్మకం మాత్రం తనకుంది కాబట్టి ప్రత్యక్షంగా దేశాన్ని, పరోక్షంగా నన్నూ అలా తూర్పార బట్టేది.

పిల్లి బాధ ఎందుకని ఊరుకోవాల్సివచ్చింది నాకు!

ఈ అలుసు చూసుకొందనుకొంటాను ఆ పిల్లి, ఇంట్లో నేనున్నా కూడా నన్ను లక్ష్యపెట్టేదిగాదు. 'నువ్వెవ్వడివి పోవోయ్' అన్నట్లు నీ లెక్క నాకేంటి అన్నట్లు అది చూస్తున్నట్లు అనిపించేది. ఆ మాటే అరుణతో అందామనుకొన్నాగాని.. అరుణ జవాబు నాకు తెలీంది గాదుగదా. "పిచ్చి ముండండీ అది! దానికేం తెలుస్తుందీ ఆ సంగతులన్నీ.. అయినా మీరడుగుతున్నారు గదా దానికి నే చెప్తాలెండి, ఈ ఇంటికి హెడ్ ఆఫ్ ది ఫ్యామిలీ మీరేనని!'

అని వేళాకోళం ఆడుతుంది. పిల్లి నిర్లక్ష్యాన్ని భరించగలమేమో గానీ పెళ్ళాం నిర్లక్ష్యాన్నీ, వేళాకోళాన్నీ భరించగలమా చెప్పండి! ఎవరో అన్నట్లు అది ఏకంగా మన మగసిరికే మచ్చ అయిపోదూ!

ఈ పిల్లి గురించి మర్చిపోదామనీ ఎన్నో ప్రయత్నాలు చేసేవాడిని. కానీ అదే 'అలా వీల్లేదు. నా ఉనికి నువ్వు గమనించితీరాల్సిందే' నన్న రీతిలో ఏ టేబుల్ మీదో పుస్తకాలమీదో ముచ్చటగా పడుకొనో, ఏ దుప్పటిలోనో వెచ్చగా దూరో దర్శనం ఇస్తుండేది. నన్ను చూడగానే ఇక తప్పదన్నట్లు 'వచ్చావా నాయనా?' అన్న రీతిలో 'మ్యావ్' మంటూ దిగేది. కానీ అరుణ మాత్రం 'చూశారా! సారీ చెప్తోంది' అని నాకు సర్దిచెప్పేది.

ఒక పిల్లితోనే ఇన్ని అవస్థలు పడుతున్న నాకు ఓ రోజు ఉదయానే ఇంట్లో వింతగా మరిన్ని ధ్వనులు వినపడసాగాయి. ఏమిటా అని ఆలోచిస్తే ఏముందీ, మా మంచంకిందే ఆ పిల్లి పిల్లల్ని పెట్టింది! ఆ కూనలు చేస్తున్న ధ్వనులవి!

మంచం కిందకు వంగి చూశాను. ఓ గోనె సంచీమీద ఆ పిల్లి కూనలన్నీ నక్కి పడుకొన్నాయి. అంత చిన్న పిల్లల్ని చూస్తోంటే ముచ్చటగా అనిపించింది కానీ... ఇవన్నీ రేపట్నించి ఇల్లంతా పీకి పందిరేస్తాయనే భయం నాలో క్షణంకాలం పెరిగింది.

"అరుణా, ఏమైనా సరే, ఈ వేళ మంచంకింద సామాన్లు తీసెయ్యాల్సిందే" అన్నాను.

"తప్పండీ, పిల్లలతల్లి అది, దాన్నిపుడు హింస పెట్టటం మహాపాపం" అంది అరుణ.

ఎంతైనా ఆడది! తన జాత్యభిమానాన్ని వదులుకోలేక అలా అంటోంది అనుకొన్నాను.

"అదీ, దాని పిల్లలూ రేపట్నించి ఇల్లంతా నానా గోలచేస్తాయి. పాపపుణ్యాలేమీ లెక్క చెయ్యద్దు. దాన్నేం మనం చంపటంలేదుగదా! బయటకు తరిమేస్తున్నాం అంతే".

"ఏమోనండీ ఆ పాపం నేను చూడలేను!" అరుణ. అంటే ఏమిటో మీకు తెలీదుగానీ ఆ మాటలకు అర్థం నాకు తెలుసు – దాన్ని గాంధీగారి భాషలో సహాయ నిరాకరణోద్యమం అంటారు. పెద్ద మాటలాగ కనిపిస్తుంది గానీ, అసలది పని చెయ్యనని మొరాయించటమేనన్న మాట, అంతే!

ఒక్కడినీ ఆ పిల్లిని తరమలేనని, మంచం కింద ఆ పాత పెట్టెలు, పుస్తకాలు సర్దుకోలేనని అరుణ అలా ధీమాగా అంటోంది.

అందుకే ప్లేటు మార్చాను. "చూడు అరుణా! నేనే పాడుపనీ చెయ్యను, నీమీదొట్టు. మంచం కిందవన్నీ ఇటు లాగుతాను. వాటిని ఒకటొకటిగా పైన సర్దేద్దాం! ఒక్కడిని చెయ్యాలంటే రెండు రోజులు పడుతుంది. నువ్వుకూడా సాయం చేశావనుకో, ఓ గంటలోనే అయిపోతుంది. కాలమూ, పనీ లెక్కలు నీకు తెలుసుగదా!"

అరుణ నవ్వేసింది. తల అడ్డంగా ఊపేసింది. మీ పప్పులేమీ నా దగ్గర ఉడకవని ఖచ్చితంగా చెప్పేసింది. గంటో అరగంటో ఎంతైనా కానీ, నేను ఆ విషయంలో అవగింజంత సాయమైనా చెయ్యను. పిల్లి తన పిల్లల్ని ఏడిళ్ళు తిప్పుతుందంటారుగదా, మీకెందుకూ ఆ తొందర, అవే పోతాయిలెండి అని తీర్పు ఇచ్చేసింది.

ఓ రోజు గడిచింది. రెండురోజులు గడిచాయి. ఎక్కడా ఆ పిల్లి, పిల్లల్ని ఇంకో ఇంటికి బదిలీ చేసే ప్రయత్నంలో లేకపోయేసరికి నాకు భయం పట్టుకొంది. ఆఖరికి ఇవన్నీ ఇక్కడే శాశ్వతంగా ఉండిపోతాయా అనిపించింది. వీటికి మా ఆవిడ రెఫ్యూజీ స్టేటస్ ఇచ్చేస్తూ ప్రత్యేక సౌకర్యాలు కూడా అందజేస్తున్నట్లు వేళకు ఓ పాత గిన్నెలో పాలుకూడా పోసిపెట్టటమూ ఆరంభించింది.

'ఇంకేం పోతుంది ఈ పిల్లి ఇక్కడి నుంచి!' అన్న నీరసం పట్టుకుంది నాలో.

ప్రపంచంలో ఎక్కడైనా ఇదే పరిస్థితి. శరణార్థులపట్ల జాలి చూపిస్తాం మనం. వాళ్ళేం చేస్తారు. నెత్తికెక్కి కూర్చుంటారు. ఈ రోజు ఈ మార్జాల సంతు అంతా మంచంకింద ఉందిగానీ రేపు నా కళ్ళముందే ఇవన్నీ మంచం మీద పీఠం వెయ్యకుండా ఉంటాయా?

ఎవరు నాకిపుడు సాయం? 'దైవమా' అని గట్టిగా అరవాలనిపించింది. కానీ అరుణ...."
ఏం, పిచ్చిపట్టిందా ఏమిటి?" అంటూ నవ్వుతుంది.

ఛ, సొంత ఇంటిలో... ఎంతటి అవమానం! మరో రెండు రోజులు తర్వాత ఆఫీసునుంచి ఇంటికి వచ్చేసరికి ఇల్లంతా మ్యావ్ ధ్వనులతో మార్మోగిపోతోంది. పెద్దపిల్లీ దాని పిల్లలూ ఒకటే గోల చేస్తున్నాయి.

"చూశావా, ప్రాణాలు తోడేస్తున్నాయి. చెప్తే విన్నావుగాదు. ఆఖరికి మనం ఇల్లు ఖాళీ చేసి వెళ్ళాలేతప్ప అవి మన మాట వినేలా లేదు!" అంటూ విసుక్కొన్నాను.

అరుణేమీ జవాబివ్వలేదు. ఏమంటుంది పాపం! తప్పు తనదేగదా మరి!!

స్నానం చేసి వచ్చాక అరుణ తెచ్చిన టీ అందుకున్నాను.

అంతసేపూ ఆ పిల్లులు చేస్తున్న గోల.... అంతా ఇంతా కాదు. చెవులు దిబ్బడ పడిపోతున్నాయి.

"మధ్యాహ్నంనుంచీ ఇలాగే ఉందండీ ఇల్లు! ఎలా అయిందో తెలీదు. ఓ పిల్ల తప్పిపోయింది. మొత్తం నాలుగుకదా పిల్లల్ని పెట్టింది. ఇపుడు మూడే ఉన్నాయి అందుకే ఆ పిల్లి గోలెట్టేస్తోంది కూడా, అవీనూ..." అరుణ నెమ్మదిగా కారణం చెప్పింది.

"ఎవరింటికో మార్చి మరచిపోయి ఉంటుంది" నెమ్మదిగా అన్నాను.

"లేదండీ, పిల్లికి మతిమరుపు ఉంటుందని నేను అనుకోను, అదేదో పొరపాటువల్లే జరిగి ఉంటుంది. ఆ బెంగతోనే కాబోలు ఆ పిల్లి అసలు ఏమీ ముట్టడంలేదు. ప్లేట్లో పోసిన పాలు అన్నీ అలాగే ఉన్నాయి."

నాకు ఆశ్చర్యంగా అనిపించింది. వెళ్ళాను. మంచం కిందకు తొంగిచూసాను. ప్లేట్లో పాలు పోసినవి పోసినట్లే ఉన్నవి.

నన్ను చూసి, మ్యావ్ మంది ఆ పిల్లి, ఆ అరుపులో 'ఆ పిల్లను నువ్వు చూసావా' అన్న ప్రశ్న వినిపించింది నాకు.

తిరిగి డ్రాయింగ్ రూంలోకి వస్తోంటే అడిగింది అరుణ "మీరే తీసుకెళ్ళి ఎక్కడో వదిలెయ్యలేదుగదా!"

నాకా ప్రశ్న ఎక్కడో తగిలింది. ఎలా అడిగిందా ప్రశ్న! నాలో అంత దుర్మార్గుణ్ణి చూస్తోందా?

అరుణకేసి చూశానొకసారి.

"మీరలా చేసి ఉండరని నాకు తెలుసు! అయినా ఆపుకోలేక అడిగా", అంటూ సంజాయిషీలా చెప్పింది అరుణ.

పిల్లిపిల్ల ఏమయి ఉంటుందోనని నేనూ ఆలోచించసాగాను. ఆ పిల్లి పాపం ఎక్కడెక్కడికో వెళ్ళివస్తోంది; మ్యావ్ మ్యావ్ మంటూ ఒక్కో ఇల్లూ చూసి మళ్ళీవచ్చి మంచం కింద చెక్ చేసుకొంటోంది గాబోలు వరసగా ఎన్నో ట్రిప్‌లు అలా తిరుగుతూనే ఉంది! దాని ఆతృత, ఆదుర్దా చూస్తోంటే గుండె తరుక్కుపోతూ వచ్చింది.

రాత్రి ఆ ప్లేట్లో పాలు పారబోసి, మళ్ళీ ఫ్రెష్‌పాలు పోసింది అరుణ. అలా ఒకసారి ఆ ప్లేట్‌కేసి చూసిందేగాని పిల్లివచ్చి వాటి వాసననయినా చూడలేదు.

చిత్రంగా అనిపించింది నాకు!

రాత్రిపూట నైట్‌స్టార్ వెలుగులో ఆ పిల్లి అటూ ఇటూ కంగారుగా తిరగటం నేను చాలా సార్లు గమనించాను.

వెళ్ళి ఆ పిల్లిపిల్ల ఆచూకీ తెలుసుకొందామా అనిపించింది గానీ ఆ పనేదో ఆ పిల్లి చేస్తూనే ఉందిగదా! అంతకన్నా సిన్సియర్‌గా ప్రయత్నించటం మావల్ల కాదనేది నిజం. నిస్సహాయంగా ఉండిపోయాను! మర్నాటికి కూడా ఇంట్లో గోల తగ్గలేదు, తల్లీపిల్లలూ గోల పెంచాయేగానీ తగ్గించలేదు.

రోజు గడిచిందన్న సంగతీ ఆ పిల్లికి తెలిసిందో లేదో గానీ, పిల్ల తప్పిపోయి చాలాకాలం అయిందన్నభావంతో కాబోలు, ఆ పిల్లి గోల పెంచింది. జోడు సన్నాయిల్లాగా ఆ పిల్లలూ..

అరుణ మళ్ళీ రెండు సార్లు పాలు మార్చింది.

"అదేమీ తినటంలేదండీ, పాడుముండ" అంది అరుణ

"ఇలా నిరాహారదీక్షతో చచ్చి ఊరుకొంటుందేమో, ఖర్మ! లేనిపోని బ్రహ్మ హత్య పాతకం మనకు చుట్టుకొంటుంది!!" అన్నాను.

అరుణ దానికే జవాబూ ఇవ్వలేదు. ఏం చెయ్యాలో ఎలా దాన్ని ఆదుకోవాలో అర్థంకాని నిస్సహాయతలో ఉండిపోయాం మేం ఇద్దరమూ!

ఆ తల్లీ పిల్లలు అలా అభోజనంగా ఉంటూంటే మేం కడుపునిండా తినటం నాకు గిల్టీగా కూడా అనిపించింది. లేనిపోని తలనెప్పి తెచ్చిపెట్టుకొన్నామా అనిపించింది!

రాత్రి అయింది. మంచంకింద ఆ పిల్లలు గోల చేస్తున్నా ఎలాగో నిద్రపోయే ప్రయత్నం చేశాను. అప్పటికే వరసగా రెండు రాత్రులనుంచి ఇలాంటి డిస్టర్బ్‌డ్ స్లీప్ కారణంగా నాకు తెలీకనే నిద్ర పట్టేసింది.

పొద్దున్న ఉన్నట్లుండి మెలకువవచ్చింది. మంచంకింద ఏ చప్పుడూ లేదు. ఉలికిపడ్డాను! ఏం జరిగిందో ఏమోనన్న బెంగతో అదుటున కిందకు దిగాను.

కింద గోనెసంచి మీద నాలుగు పిల్లులూ ఒకదానిపక్కన ఒకటిముడుచుకొని పడుకొని ఉన్నాయి. నేను కిందకు దిగిన అలికిడికి ఆ తల్లిపిల్లి కళ్ళు తెరిచింది. లేచి, వచ్చి ఉన్నట్లుండి నా పాదాన్ని చిన్నగా నాకింది.

తన పిల్ల కనపడిందన్న సంతోషాన్ని వ్యక్తం చేయడం కాబోలు, అది!

నాకెందుకో ఎంతో సంతోషంగా అనిపించింది.

మంచం మీదనుంచి అరుణ ఆ క్షణంలో ఆనందంతో వెలిగిపోతోన్న ముఖంతో, చిరునవ్వులు చిందిస్తూ చిద్విలాసంగా చూస్తూ ఉండిపోయింది.

ప్లేట్లో పాలు ఒక్క చుక్క అయినా లేవు. వెళ్ళి పాలపాకెట్ చింపి కొన్ని పాలు ఆ ప్లేట్‌లో పోసాను.

ఈ హడావిడికి కళ్ళు తెరిచిన ఆ కూనలన్నీ వచ్చి ప్లేట్‌కు నాలుగు పక్కలా నిలబడి, పాలు చప్పరిస్తోంటే ఆ పిల్లి దూరంగానే నిలబడి ఆనందంగా చూసుకొంటోంది!

నిజమే, నిన్నటివరకు అది నా దృష్టిలో ఓ పిల్లి మాత్రమే.

ఇపుడాపిల్లిలో నాకు అసామాన్యమైన మాతృహృదయంతో ఓ తల్లి కనిపిస్తోంది.

– స్రవంతి, వినూత్న వారపత్రిక, 02.04.1987